సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



పారదర్శకంగా బదిలీలు

ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8లో▸



మగ్గం చాటున మగ్గిన బతుకులు

పెద్ద పెద్ద యంత్రాలు లేని సమయంలో ఇంట్లో మగ్గాలపై దుస్తులను తయారు చేసి పరిశ్రమగా ఎదిగింది ఆ గ్రామం. పూర్వవైభవాన్ని కోల్పోయి నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. 8లో▸



ఘనంగా శ్రీకృష్ణాష్టమి

జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు రాధాకృష్ణుడి వేషధారణల్లో అలరించారు. ఉట్టే కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్లీనరీ



సంగారెడ్డిలో జెండాలను ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ మహిళా నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమేశ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం విద్యార్థి ర్యాలీతో పాటు బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను హాజరవుతున్నారన్నారు. అలాగే 33 జిల్లాల నుంచి 350 మంది ప్రతినిధులు కూడా వస్తున్నట్లు తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కాగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సంగారెడ్డి పట్టణాన్ని ఎస్‌ఎఫ్‌ఐ జెండాలు, తోరణాలతో అలంకరించారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేపట్టడంతోపాటు బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి డిమాండ్ చేశారు. రెండు రోజులుగా జరుగుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి , ఉపాధి రంగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు సాధారణ ప్రక్రియ అని, ఆ ప్రక్రియను సీఎం కేసీఆర్ అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సర్కార్‌కు రాబోవు ఎన్నికల్లో బుద్ధి చెప్పేలా విద్యార్థి లోకం ఏకం కావాలని పిలుపునిచ్చారు.


కాంగ్రెస్ పాలనలో మత్స్యకారుల నిర్లక్ష్యం



నల్లవాగు ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మత్స్యకారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం .భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగులో ప్రభుత్వం పంపిణీ చేసిన 11.14 లక్షల చేపపిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సతీశ్, ఆత్మ చైర్మన్ రాంసింగ్, జెడ్పీటీసీ సభ్యులు రాఘవరెడ్డి, నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నల్లవాగు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రవి, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు, సర్పంచ్‌లు సంజీవరెడ్డి, గంగామణి, నాయకుడు గుర్రపు జలంధర్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



కె.శ్రీనివాస్

జహీరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా జహీరాబాద్‌కు చెందిన కె.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర మున్సిపల్ ఫోరం కన్వీనర్ జి.ప్రభాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట్‌రావు, కార్యదర్శిగా ఎండీ సాజిద్ అహ్మద్, కోశాధికారిగా మురళి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, నాగేశ్వర్‌లు పాల్గొన్నారు.

అభ్యర్థుల కోసం అన్వేషణ

- అందోల్, జహీరాబాద్‌లలో బీజేపీకి నాయకత్వ సమస్య
- ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను దీటుగా ఎదుర్కొనేందుకు పావులు
- బలమైన అభ్యర్థిపై అధిష్టానం ఫోకస్



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీజేపీకి జిల్లాలో పలు చోట్ల నాయకత్వ సమస్య వెంటాడుతోంది. ప్రధానంగా ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో బలమైన నాయకులు లేకపోవడంతో రానున్న ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థుల కోసం అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొంది. అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వగల నేతలెవరూ కనిపించడం లేదు. ఉన్న ఒకరిద్దరు నేతలు నియోజకవర్గాలను పెద్దగా పట్టించుకోకపోవడంతో బీజేపీ క్యాడర్‌లో నిస్తేజం నెలకొంది.

అందోల్‌లో అయోమయం

అందోల్ నియోజకవర్గం బీజేపీలో అయోమయం నెలకొంది. ఇక్కడి పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న మాజీ మంత్రి బాబుమోహన్ నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు ప్రైవేటు కార్యక్రమాలకు హాజరై వెళ్లిపోతున్న ఆయన ప్రధాన పార్టీలకు ధీటుగా నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపించలేకపోతున్నారు. గత ఎన్నికల్లో ఆయనకు నామమాత్రంగా ఓట్లు రావడంతో ఆయన పూర్తిగా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. మరోవైపు మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య కూడా మొక్కుబడిగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిత్వం ఖరారైంది. అధికారిక, పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు ఇలా నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ కూడా ఇక్కడి అభ్యర్థిత్వం దాదాపు ఖరారైంది. ఆ పార్టీ శ్రేణులు కూడా ప్రజల్లో ఉంటున్నారు. కానీ, బీజేపీ పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ప్రజా సమస్యలపై నిత్యం గళం విప్పాల్సిన నేతలు అస్సలు పట్టించుకోవడం లేదు. దీనికితోడు బీజేపీ నిర్దేశించిన కార్యక్రమాలు కూడా మొక్కుబడిగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థి ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనికి తోడు ఎన్నికల వేళ ఉత్సాహంగా పనిచేయాల్సిన కమలం క్యాడర్‌లో పూర్తిగా నిస్తేజం నెలకొంది.

జహీరాబాద్‌లోనూ..

జహీరాబాద్ నియోజకవర్గంలోనూ దాదాపు ఇలాంటి సమస్యే బీజేపీ ఎదుర్కొంటోంది. గతంలో ఇక్కడ బీజేపీ ముఖ్యనేతల్లో ఒకరైన జంగం గోపీపై కొన్ని నెలల క్రితం సస్పెన్షన్ వేటు పడింది. పార్టీ కార్యక్రమాల్లో బీజేపీ నేతలపై పరస్పరం దాడులు చేసుకోవడం, ఏకంగా పోలీసు కేసులు నమోదు కావడం వంటి ఘటనలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన రాంచందర్ రాజనర్సింహ, బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన చింతల్‌ఘాట్ సధీర్ కుమార్ ఇక్కడ పార్టీ కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ, అవి మొక్కుబడిగానే సాగుతున్నాయనే అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మొత్తం మీద అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులను ఎదుర్కొనే స్థాయి నేతలు బీజేపీలో ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది.

బలమైన నేతల కోసం..

అందోల్, జహీరాబాద్ నియోజవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులెవరో దాదాపు స్పష్టత వచ్చింది. అందోల్‌లో బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ బరిలో ఉండనున్నారు. అలాగే జహీరాబాద్‌లో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి చంద్రశేఖర్ తలపడనున్నారు. దీంతో ఈ రెండు చోట్ల ఆయా పార్టీల అభ్యర్థులను ఎదుర్కొనే సత్తా ఉన్న నేతల కోసం పార్టీ అన్వేషించాల్సిన పరిస్థితి ఉందనే అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. దీన్ని అధిగమించేందుకు ఇతర పార్టీల్లో టికెట్టు రాక భంగపడిన నేతలను పార్టీలో చేర్చు కునే ప్రయత్నాలు అధినాయకత్వం చేస్తోందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది.

• 'బాల' గోపాలం



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని గణేశ్‌నగర్ శ్రీ మురళీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం నేత్రపర్వంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ కృష్ణుడికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, కౌన్సిలర్ పవన్‌నాయక్, కంది జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లాడే మల్లేశం, సర్పంచ్ మోహన్‌సింగ్ నాయక్, మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాల సరిహద్దుల్లో నిఘా



మాట్లాడుతున్న బీదర్ జిల్లా ఎస్పీ చెన్నబసవన్న, చిత్రంలో ఎస్పీ రమణకుమార్ తదితరులు

- మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు
- ఎస్పీ రమణకుమార్
- సమావేశమైన సరిహద్దు జిల్లాల ఎస్పీలు

జహీరాబాద్: రానున్న ఎన్నికల దృష్ట్యా తెలంగాణ రాష్ట్రంలోకి సరిహద్దు జిల్లాల నుంచి మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా సరిహద్దుల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్పీ రమణకుమార్ అన్నారు. గురువారం జహీరాబాద్‌లో సరిహద్దులో ఉన్న బీదర్, కరీంనగర్ జిల్లాల ఎస్పీలు చెన్నబసవన్న, బి.శ్రీనివాస్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ విద్రోహ శక్తులు జిల్లాలోకి ప్రవేశించి అల్లర్లు సృష్టించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పరస్పర సమాచార మార్పిడితో నేరాలను అరికట్టవచ్చన్నారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకారం అవసరమని బీదర్ జిల్లా ఎస్పీని కోరారు. అనంతరం బీదర్ జిల్లా ఎస్పీ చెన్నబసవన్న మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసుల పాత్ర ఎంతో ఉందన్నారు. అలాగే తెలంగాణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ అశోక్, జహీరాబాద్, నారాయణఖేడ్ ఆర్‌డీఓ వెంకారెడ్డి, వెంకటేశ్, డీఎస్పీలు రఘు, వెంకట్‌రెడ్డి, బాల్కి డీఎస్పీ పవర్‌శెట్టితో పాటు పోలీసు, ఫారెస్టు, మోటారు వెహికిల్ అథారిటీ అధికారులు రాధికారెడ్డి, చంద్రశేఖర్, సుభాష్, శివలింగం, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



సంగారెడ్డిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ: రాబోయే ఎన్నికల్లో అఖండ విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంత కిషన్ ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చేసిన జోడో యాత్ర చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసి ఏడాది అవుతున్నందున టీపీసీసీ వర్గాల ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన సంతోష్, బుచ్చి రాములు, జార్జి, మాజీ ఎంపీపీ చేర్యాల ఆంజనేయులు, ఎంపీపీ లావణ్య, కౌన్సిలర్ మిరుదొడ్డి రాజు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతోనే భవిష్యత్

జహీరాబాద్: నైపుణ్య శిక్షణ పొందడం ద్వారానే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెన్నైకి చెందిన ఎస్‌ఎల్‌సీఐఎల్ పబ్లిక్ రిలేషన్ మేనేజర్ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో వికాస్ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ పొందిన యువతీ యువకులకు సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి బీఎంఎస్ జాతీయ మాజీ అధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ కర్మాగారాలు సీఎస్‌ఆర్ నిధులతో నైపుణ్యాభివృద్ధితో పాటు అనేక ఇతర సామాజికాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు లక్ష్మారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన వారు ఉపాధి అవకాశాలను పొంది భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ గౌరవ కార్యదర్శి సురరాజగోపాల్‌రెడ్డి, వికాస్ సంస్థ అధ్యక్షుడు, ఏపీపీసీ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస రఘు, మాణిక్‌ప్రభు ప్రధానోపాధ్యాయుడు మధుకర్‌ల, మనోహర్, సురేందర్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, కె.సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

16న సైన్స్ సెమినార్

మెదక్ కలెక్టరేట్: ఈ నెల 16వ తేదీన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ గురువారం తెలిపారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో సెమినార్ ఉంటుందని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనేలా హెచ్‌ఎంలు చూడాలన్నారు. మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ లేదా డైట్ ఫ్యాడ్ అనే అంశంపై ఆరు నిమిషాలు నిడివి గల ప్రదర్శన చేయొచ్చన్నారు. సెమినార్‌లో పాల్గొనేవారి వివరాలను సంబంధిత గైడ్ టీచర్‌లు ఈనెల 12వ తేదీలోగా 8328 599 157 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డిని సంప్రదించాలని సూచించారు.

చక్కెర కర్మాగారాన్ని కొంటాం

ఢిల్లీ వసంత్ బృందం

జహీరాబాద్ టౌన్: ట్రిడెంట్ చక్కెర కర్మాగారాన్ని కొనుగోలుకు బీఆర్‌ఎస్ నాయకుడు, సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ బృందం నడుంబిగించింది. పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో 'మట్టి మనుషుల మనోగతం– భూమి పుత్రుల ఆకలి కేక' పేరిట ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, 72 గంటల పాటు సర్వమత ప్రార్థనలు చేసిన విషయం తెలిసిందే. గురువారం నిర్వహించిన ముగింపు సమావేశంలో ఢిల్లీ వసంత్ మాట్లాడుతూ చక్కెర కర్మాగారాన్ని వదులుకోబోమని, తామే కొనుగోలు చేస్తామన్నారు. దళితబంధు పథకం కింద నియోజకవర్గానికి 1,100 యూనిట్లు మంజూరయ్యాయని, ఈ పథకం ద్వారా చేస్తున్న రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో లబ్ధిదారులను భాగస్వామ్యులను చేసేందుకు కృషి చేస్తామన్నారు. తాము కూడా భాగస్వాములమవుతామని, తన వంతుగా రూ.కోటి ఇస్తానని ప్రకటించారు. తమ బృందం సభ్యులు కూడా రూ.6 కోట్ల విలువైన షేర్లను కొనడానికి ముందుకు వచ్చారన్నారు. చక్కెర కర్మాగారం కొనుగోలు చేసేందుకు ప్రజలను భాగస్వామ్యం చేస్తామన్నారు. నేటి నుంచి గ్రామాల్లో పర్యటించి ప్రజల మద్దతు కోరతామన్నారు. ఫ్యాక్టరీని కాపాడుకొనేందుకు అలాగే రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కారం కోసం ఈనెల 14 నుంచి సత్యాగ్రహ దీక్షలు చేపడుతామన్నారు. తెలంగాణ వాటర్ రిసోర్స్ కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాశ్‌రావు ఢిల్లీ వసంత్‌కు సంఘీభావం తెలిపారు. చక్కెర కర్మాగారం, రైతుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, మైపాల్ యాదవ్, థామస్ స్టీవెన్, అశోక్ పాటిల్, నారాయణ, గోవింద్‌రెడ్డి, కృష్ణయ్య, విశాల్ గొడ్కే, ముదిగొండ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని కొంటామని తీర్మానం చేస్తున్న ఢిల్లీ వసంత్ బృందం

ఢీఆర్‌ఎస్..!

మెదక్ బీఆర్‌ఎస్‌లో వర్గపోరు

- ఏడుపాయలలో పరస్పర ప్రమాణాలు
- వేడెక్కుతున్న జిల్లా రాజకీయాలు
- కేడర్‌కు తలనొప్పిగా మారిన నాయకుల వ్యవహారం

మెదక్: అసమ్మతి నాయకుల సవాళ్లు, నాయకుల ప్రతివాళ్లతో జిల్లా బీఆర్‌ఎస్‌లో అంతర్గత విబేధాలు భగ్గుమన్నాయి. పరస్పర ఆరోపణలతో జిల్లా బీఆర్‌ఎస్ రెండుగా విడిపోయిందనే విమర్శలు వస్తున్నాయి. మెదక్ టికెట్ ప్రకటనతో ప్రారంభమైన గొడవ.. ఏడుపాయల ఈఓ వివాదంతో ఒకరిపై ఒకరు మాటల దాడి చేసుకునే వరకూ వెళ్లింది. గత నాలుగు రోజులుగా సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేసుకున్న ఇరువర్గాలు.. గురువారం ఏడుపాయలలో బహిరంగ ప్రకటనలు చేశారు. మెదక్ నుంచి అధిక మెజార్టీతో గెలుస్తామని ఓ వర్గం, అభ్యర్థిని మార్చకుంటే రెబల్‌గా పోటీ తప్పదని మరోవర్గం ప్రకటించడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

టికెట్ ప్రకటనతో ప్రారంభమై..

మొదటి నుంచి టికెట్ మాకంటే మాకేనని సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వర్గీయులు ప్రచారం చేసుకున్నారు. మరోవైపు మైనంపల్లి డాక్టర్ రోహిత్ ఆరు నెలలుగా సేవా కార్యక్రమాలు చేపడుతూ తాను కూడా మెదక్ టికెట్ ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సిట్టింగ్‌కే టికెట్ కేటాయిస్తూ బీఆర్‌ఎస్ అధినేత నిర్ణయం తీసుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మంత్రి హరీశ్‌రావుపై తీవ్రమైన ఆరోపణలు చేయడంతో పొలిటికల్ దుమారం చెలరేగింది. మైనంపల్లి, శేరి సుభాష్‌రెడ్డి వర్గాలు మెదక్ అభ్యర్థిపై పునరాలోచించాలని ప్రెస్‌మీట్లు పెట్టడం చర్చకు దారి తీసింది.

ఆజ్యం పోసిన ఈఓ వ్యవహారం..

నివురు గప్పిన నిప్పులా బీఆర్‌ఎస్‌లో మైనంపల్లి, దేవేందర్‌రెడ్డి మధ్య వర్గపోరు కొనసాగుతుండగా ఏడుపాయల ఈఓ శ్రీనివాస్ అమ్మవారి నగల వ్యవహారం దీనికి ఆజ్యం పోసినట్టైంది. దేవేందర్ రెడ్డి అండతోనే ఈఓ అక్రమాలకు పాల్పడుతున్నారంటూ బీఆర్‌ఎస్‌లోని అసమ్మతివర్గం తీవ్ర ఆరోపణలు చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని ఏడుపాయల అమ్మవారి సన్నిధిలో తడి బట్టలతో ప్రమాణం చేస్తానని, తనపై ఆరోపణలు చేసినవారు కూడా ప్రమాణం చేయాలంటూ ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ క్రమంలో గురువారం రెండువర్గాలు తమ కార్యకర్తలతో ఏడుపాయలకు చేరుకొని అమ్మవారి సన్నిధిలో పరస్పరం ప్రమాణాలు చేశారు. అనంతరం మెదక్ నుంచి భారీ మెజార్టీతో గెలుస్తానని దేవేందర్‌రెడ్డి తెలుపగా, అభ్యర్థిని మార్చాలని, లేదంటే రెబల్‌ను పోటీలో దింపి గెలిపించుకుంటామని అసమ్మతి వర్గం ప్రకటించింది. జిల్లా బీఆర్‌ఎస్‌లో వర్గపోరు తారా స్థాయికి చేరడంతో కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ప్రతిపక్షాలను మించి ఒకరిపై ఒకరు బహిరంగ ఆరోపణలు చేయడంతో పార్టీ ప్రతిష్టను రోడ్డున పడేస్తున్నారని, దీనిపై అధిష్టానం త్వరగా నిర్ణయం తీసుకోకుంటే పార్టీకి నష్టం తప్పదని మదనపడుతున్నట్లు సమాచారం.



బుజ్జగించేందుకు ప్రయత్నించినా..

అంతర్గత వర్గపోరుకు చెక్ పెట్టేందుకు మంత్రి హరీశ్‌రావు రంగంలోకి దిగారు. అసమ్మతి నాయకులను బుజ్జగించేందుకు ప్రయ్నతించినా వారు పట్టు వీడలేదని తెలిసింది. నిర్వహించిన జెడ్పీ సమావేశానికి మంత్రి ముఖ్యఅతిగా హాజరయ్యారు. ఆ సమయంలో ఎంపీపీ చందన పాపన్నపేట మండలంలో రూర్బన్ పథకం కింద చేపట్టిన బిల్లులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఆ నిధులు కేంద్రం నుంచి వస్తాయని చెప్పడంతో తమను పట్టించుకోవడంలేదని మనస్తాపం చెందిన ఎంపీపీ దంపతులు.. ఎమ్మెల్యేకు దూరంగా ఉంటూ మైనంపల్లి రోహిత్‌కు దగ్గరైనట్లుగా తెలుస్తోంది.

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఈఎంటీ సంగమేశ్వర్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం గొపన్‌పల్లికి చెందిన గర్భిణి సుజాత(26)కు గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా.. పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. సుజాతకు ఆడబిడ్డ పుట్టగా, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. తదుపరి వైద్య సేవల కోసం జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బంది ఈఎంటీ సంగమేశ్వర్, పైలట్ ప్రశాంత్ కుమార్‌లను కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు బైక్‌లు చోరీ

నర్సాపూర్: నర్సాపూర్‌లో ఇటీవల ఇళ్ల ఎదుట పార్కు చేసిన రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఆముద శ్రీనివాస్ తమ ఇంటి ఎదుట టీఎస్ 35బి 5380 నంబరు బైక్‌ను దొంగలు అపహరించారు. అదే కాలనీకి చెందిన నరేందర్ తన ఇంటి ఎదుట పార్కు ఏపీ 23ఎస్ 5234 నంబరు బైక్ సైతం చోరీకి గురైంది. ఎస్ఐ శివకుమార్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని చెప్పారు.

సీజ్ చేసిన రైస్ మిల్లులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో ఏడాదిన్నర క్రితం సీజ్ చేసిన రైస్‌మిల్లులో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. మిల్లులో ఉంచిన గన్నీబ్యాగ్‌లకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న గిర్దావర్ ధన్‌సింగ్ సిబ్బందితో కలసి మంటలు మరింత విస్తరించకుండా గోనె సంచులను పక్కకు తరలించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. మిల్లులో సీల్ వేసిన ప్రధాన గేటు నుంచి కాకుండా వేరే మార్గంలో లోపలికి ప్రవేశించిన వ్యక్తుల వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. సీజ్ చేసిన రైస్‌మిల్లును కొందరు పేకాట ఆడటానికి, మద్యం సేవించడానికి అడ్డాగా మార్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వ్యక్తి అదృశ్యం



శేఖర్

సిద్దిపేటఅర్బన్: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎన్సాన్‌పల్లికి చెందిన చెక్క శేఖర్ (35) మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో మానసికస్థితి సరిగా లేక 2022 నవంబర్ 16న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటివరకు ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. నాలుగు నెలల క్రితం భువనగిరి, తిరుమలగిరి ప్రాంతాల్లో ఉన్నాడని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి వెతికినా దొరకలేదు. ఫిర్యాదు చేయడం ఆలస్యమైందని, తన కుమారుడి ఆచూకీ కనిపెట్టాలని తల్లి సత్తవ్వ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు



రాములు (ఫైల్)

దుబ్బాకరూరల్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎనగుర్తిలో జరిగింది. ఎస్ఐ భువనేశ్వర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్ల రాములు(55) బుధవారం మధ్యాహ్నం కూడవెల్లి వాగులో చేపలు పట్టడానికి వెళ్లాడు. థర్మకోల్ తెప్పపై కూర్చొని చేపలు పడుతున్న క్రమంలో వరద ఉధృతి ఎక్కువ రావడంతో జారి వాగులో పడి మునిగిపోతుండగా.. అదే గ్రామానికి చెందిన బొరెల్లి రాజు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎమ్మెల్యే పరామర్శ

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘునందన్ రావు ఘటనా స్థలంలో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

చిగురించిన ఆశలు!

- కొలిక్కి వచ్చిన ఐడీఎస్‌ఎంటీ స్థలాల సమస్య
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్ శరత్
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీకి పట్టిన గ్రహణం వీడనుంది. మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో కలెక్టర్ శరత్ బుధవారం అధికారులతో చర్చించారు. న్యాయస్థానం తీర్పునకు అనుగుణంగా అర్హులైన వారి ఇళ్ల నిర్మాణానికి లైన్‌క్లియర్ చేయాలని ఆదేశించారు. రికార్డులు పరిశీలించి న్యాయస్థానం తీర్పు, స్థానిక పరిస్థితులపై సమగ్ర వివరాలు తయారుచేయాలని సూచించారు. ఈమేరకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లను పరిశీలించారు. సుమారు 200 ప్లాట్లపై కోర్టులో కేసులు ఉండగా.. అవి తప్ప మిగితా ప్లాట్లను క్లియర్ చేస్తున్నట్లు కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు.

కోర్టు కేసుతో బ్రేక్

ఐడీఎస్‌ఎంటీ కాలనీ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అనర్హులకు స్థలాలు కేటాయించారని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఉన్నతాధికారుల ద్వారా విచారణ చేయించిన న్యాయస్థానం నివేదికలు తెప్పించుకుని, నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన ప్లాట్లను రద్దు



జహీరాబాద్‌లోని ఐడీఎస్‌ఎంటీ కాలనీ

చేయాలని ఆదేశించింది. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని 2013లో తీర్పు ఇచ్చింది. కోర్టు తీర్పు ప్రకారం అన్ని ప్లాట్లు రద్దు అవుతాయని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి మున్సిపల్ చైర్మన్‌ను కొన్ని రోజుల పాటు సస్పెండ్ చేశారు. మాజీ చైర్మన్లపై కేసు నమోదు చేశారు. అప్పట్లో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయమై గతేడాది జూన్‌లో పట్టణానికి వచ్చిన మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌కు సైతం బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి న్యాయస్థానం తీర్పు, స్థానిక పరిస్థితులను బట్టి అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తాజాగా మంత్రి హరీశ్‌రావు ఇదే విషయంపై కలెక్టర్‌తో చర్చించి అర్హుల ఇళ్ల నిర్మాణానికి లైన్‌క్లియర్ చేయాలని సూచించారు.

109 ఎకరాలు.. 1,100 ప్లాట్లు


జహీరాబాద్‌లో సొంత ఇళ్లు లేని కుటుంబాలకు స్థలాలు సమకూర్చాలన్న ఉద్దేశంతో హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రాంత సమీపంలో 1982లో ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఫర్ స్మాల్ అండ్ మీడియం టౌన్ (ఐడీఎస్‌ఎంటీ) కాలనీ ఏర్పాటు చేశారు. 109 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి 1,100 ప్లాట్లుగా విభజించారు. కేంద్రం సహాయంతో చిన్న, మధ్య తరహా పట్టణంగా అభివృద్ధి చేశారు. ఈ మేరకు ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీలు చేసి కేటాయించారు. 1982లో ప్రారంభించిన ఈ పథకం ద్వారా 1987 నుంచి లబ్ధిదారులకు ప్లాట్లను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం కొన్ని చొప్పున ఇంటి స్థలాలను అందజేశారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జాబంటూ జేబు గుల్ల

- సైబర్ వలలో మరో ప్రైవేట్ ఉద్యోగి
- రూ.26 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు



పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.26 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. రామచంద్రపురం మండల పరిధిలోని ఈదునాగులపల్లికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు ఆగస్టు 16న మెసేజ్ వచ్చింది. దీంతో అతను తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.10 వేలు చెల్లించాడు. అపరిచిత వ్యక్తి తిరిగి రూ.13 వేలు బాధితుడికి వేశాడు. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.26 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు, అనంతరం బీడీఎల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రోజులకు దొరికిన మృతదేహం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గుండ్లపల్లిలోని పబ్బన్న కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన విభూతి యాదగిరి మృతదేహం మూడు రోజుల తర్వాత లభ్యం అయింది. మంగళవారం యాదగిరి గల్లంతైన విషయం విదితమే. బుధవారం గజ ఈతగాళ్లతో వెతికినా ఫలితం దక్కలేదు. మరుసటి రోజు గురువారం యాదగిరి మృతదేహం దొరికింది. పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, యాదగిరి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు బోరున విలపించారు.



యాదగిరి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పారదర్శకంగా బదిలీలు

టీపీటీఎఫ్ అధ్యక్షుడు అశోక్ కుమార్ డిమాండ్

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ భవన్‌లో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి బదిలీలు పదోన్నతుల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని కోరారు. బదిలీల్లో తలెత్తిన అంశాల్లో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ద్వారా పరిష్కరించుకోవాలని, చిన్న చిన్న అంశాలపై కోర్టును ఆశ్రయించకుండా బదిలీలు పదోన్నతుల ప్రక్రియకు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే విడుదల చేసి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సర్వీస్ పర్సన్‌ను నియమించాలని, మన ఊరు మన బడి స్కీంను రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాంచందర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు లక్ష్మయ్య యాదవ్, సోమ శేఖర్, సంజీవయ్య, రాజారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు నాజర్ పటేల్, విజయ భాస్కర్, బిచ్చయ్య, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, విజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

'ఇండియా' అంటేనే మోదీకి భయం

- జోడోయాత్రతో బీజేపీలో వణుకు
- తెలంగాణలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయం
- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: దేశాన్ని కాపాడుకునేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై ఇండియా కూటమిగా ఏర్పడితే ప్రధాని నరేంద్రమోదీలో భయం నెలకొందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశ సమైక్యత కోసం రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేపట్టి నేటికీ ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా పట్టణంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాలు కలిగిస్తుంటే దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని తెలిపారు. రాహుల్‌గాంధీ తండ్రి రాజీవ్‌గాంధీ, నాయనమ్మ ఇందిరా గాంధీలు దేశం కోసం ప్రాణాలు అర్పిస్తే, వారి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ, అమిత్ షా అనే ఇద్దరు దేశాన్ని కొల్లగొడుతున్నారని అన్నారు. కర్ణాటకలో మాదిరి తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు పూర్వవైభవం రాబోతున్నదన్నారు. కేంద్రంలో పెద్ద మోదీ, రాష్ట్రంలో చిన్న మోదీ నియంతృత్వ ధోరణితో పాలన సాగిస్తున్నారని తెలిపారు. భారత్ జోడో యాత్రతో చైతన్యవంతులైన ప్రజలు కాంగ్రెస్ పార్టీతో కలిసి రావాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, హస్సేన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు చందు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పొన్నం ప్రభాకర్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తదితరులు

మగ్గం చాటున మగ్గిన బతుకులు

- ఆర్డర్లు, పని లేక తగ్గిన ఉత్పత్తి
- రోజు కూలి కూడా దక్కని వైనం
- అందని ప్రభుత్వ ప్రత్యేక ప్యాకేజీ
- ఉపాధి కరువై.. బతుకు భారమై..
- పట్టణాల బాట పట్టిన కార్మికులు

కొల్చారం(నర్సాపూర్): పెద్ద పెద్ద యంత్రాలు లేని సమయంలో ఇంట్లో మగ్గాలపై దుస్తులను తయారు చేసి పరిశ్రమగా ఎదిగింది ఆ గ్రామం. ఏ ఇంట్లో చూసిన మగ్గాల చప్పుళ్లతో, ఎప్పుడూ పనితో బిజీగా ఉండే కార్మికుల కుటుంబాలతో కళకళలాడిన ఆ గ్రామం.. ప్రస్తుతం పూర్వవైభవాన్ని కోల్పోయి నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. నమ్ముకున్న కార్మికులకు పని కల్పించలేక నష్టాల లోతుల్లో కూరుకుపోయింది. చేనేత దుస్తుల వాడకం తగ్గడం, మార్కెట్ లేకపోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో దీనంగా మారింది. మగ్గాలను అటక మీద పెట్టి కార్మికులు బతుకుదెరువుకు పట్టణాలకు పయనమవడంతో గ్రామం ఖాళీగా దర్శనమిస్తోంది.

ఆనాడే జాతీయస్థాయి..

1948లో ప్రారంభమైన ఈ చేనేత సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అగ్గిపెట్టెలో దూరే చీర, దేశవిదేశాల్లో పేరుగాంచిన గొల్లభామ చీర, కనకాంబరాల రంగు కోకలకు కేంద్రంగా నిలిచింది. మండలంతో పాటు ఉమ్మడి కొడిపల్లి, పాపన్నపేట, టేక్మాల్ మండలాల పరిధిలో సుమారు 200లకు పైగా కుటుంబాలకు ఉపాధిని అందించింది. ఇంటిల్లిపాదికి జీవనాధారమైన చేనేత రంగం.. ప్రస్తుతం కార్మికులకు పూట తిండి పెట్టలేని పరిస్థితికి చేరింది. వారం రోజులు కష్టపడి చీర నేసినా కనీసం రోజు కూలీ కూడా దక్కకపోవడం చేనేత కుటుంబాలు ఆర్థికంగా కష్టాలను ఎదుర్కొంటున్నాయి. రంగంపేట చేనేత సంఘానికి చేయూతనిచ్చేందుకు గత ప్రభుత్వం భవనం, షెడ్డు, మగ్గాలను అందజేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రోత్సాహం కరువవడంతో ఈ రంగం మనుగడ కష్టమవుతోంది. నైపుణ్యం గల కార్మికులు సైతం కులవృత్తులను వదిలి కుటుంబ పోషణకు ఇతర పనులు చూసుకుంటున్నారు. పురుషులు సంతల్లో రెడీమేడ్ దుస్తులు అమ్ముతుండగా, ఆడవారు బీడీ కార్మికులుగా మారారు. ఆదుకునేందుకు తీసుకువచ్చిన ప్రత్యేక ప్యాకేజీలు కార్మికులకు చేరకపోవడంతో క్రమంగా కనుమరుగు దశకు చేరుకుంది. ఇప్పటికైనా సర్కారు స్పందించి చేనేతకు పూర్వవైభవం తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.



సహకార సంఘంలో మూలన పడ్డ మగ్గాలు

బీడీలు చుడుతున్నా..



చేనేత కార్మికులకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. మగ్గాలు ఉన్నా.. ఆర్డర్లు, మార్కెట్ లేక పనులు తగ్గాయి. కుటుంబపోషణకు బీడీలు చుడుతున్నా. మేం ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరింది. నా భర్తకు వచ్చే పింఛన్‌తో జీవనం సాగిస్తున్నాం.

– బొద్దుల చంద్రమ్మ, చేనేత కార్మికురాలు, రంగంపేట

ప్యాకేజీ అమలు చేయాలి



చేనేత సహకార సంఘంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. దుస్తుల తయారీ, విక్రయాలకు అవసరమైన సహకారం లేదు. ఇతర ప్రాంతాలకు అందిస్తున్న ప్యాకేజీలను ఇక్కడి కార్మికులకు అందిస్తే రంగంపేట చేనేతకు పూర్వవైభవం వస్తుంది.

– రంగయ్య, చేనేత కార్మికుడు, రంగంపేట

పెట్రోల్ డబ్బాతో వాలంటీర్ల నిరసన

- ఔట్‌సోర్సింగ్‌లో మాకే అవకాశం ఇవ్వాలని డిమాండ్
- కొమురవెల్లి ఆలయంలో ఘటన

కొమురవెల్లి(సిద్దిపేట): పదేళ్లుగా ఆలయంలో సేవ చేస్తున్న తమను కాదని ఔట్ సోర్సింగ్ విధానంలో కొత్తవారిని నియమించడం సరికాదంటూ వాలంటీర్లు పెట్రోల్ డబ్బాతో నిరసనకు దిగారు. గురువారం ఆలయ ఈవో కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కొమురవెల్లికి చెందిన వడ్లకొండ రజనీకాంత్, బత్తిని నాగరాజు, కడెం రజిత, అయినాపూర్‌కు చెందిన రేణుక నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్లుగా మల్లన్న బ్రహ్మోత్సవాల్లో వాలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్నామని, మిగతా సమయాల్లో ఆలయంలో ఉచితంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. అన్ని అర్హతలు ఉన్న తమను కాదని, అర్హత లేని వారిని నియమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ ఈవో బాలాజీ, ఆలయ చైర్మన్ గీస భిక్షపతికి ఈ సందర్భంగా వేడుకున్నారు. తమకు న్యాయం జరగని పక్షంలో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఇదే క్రమంలో ఆలయంలో పని చేసి మృతి చెందిన బత్తిని పోషయ్య భార్య బాలమణికి పింఛన్ మంజూరు కాకుండా చైర్మన్ అడ్డుకుంటున్నారని బాధితులు ఆరోపించగా ఈవో వెంటనే స్పందించి బెనిఫిట్స్ బాలమణికి అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. ఔట్‌సోర్సింగ్ నియామకాలపై ఈవో బాలాజీని వివరణ కోరగా రాజకీయ ఒత్తిళ్లతో నియమించాల్సి వస్తుందన్నారు.



ఈవో కార్యాలయంలో వాలంటీర్ల నిరసన

16 మందికి ఏఎస్ఐగా పదోన్నతి

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాకు చెందిన 16 మంది హెడ్ కానిస్టేబుల్స్‌కు అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్‌లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఎస్పీ ఎం.రమణకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘ సర్వీసులో ఎలాంటి రిమార్క్ లేకుండా బాధ్యతలను నిర్వర్తించి పదోన్నతి పొందడం పట్ల ఆయన అభినందించారు.

ఆన్‌లైన్ గేమ్సే ఆత్మహత్యకు కారణం

దౌల్తాబాద్(దుబ్బాక): ఆన్‌లైన్ గేమ్స్ సతీశ్ గౌడ్ ఉసురు తీశాయని సోదరుడు వెంకట్‌గౌడ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉప్పరపల్లికి చెందిన యాదగిరిగౌడ్ చిన్న కుమారుడు సతీష్‌గౌడ్ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. సంవత్సరం కిందట ఆన్‌లైన్‌గేమ్ ఆడి డబ్బులు పోగొట్టుకున్నాడని, దీంతో అప్పులు పెరిగిపోవడంతో గతంలోనే సతీష్‌గౌడ్ ఇంట్లో నుంచి పారిపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు అయ్యిందని తెలిపారు. మళ్లీ ఆన్‌లైన్‌గేమ్స్ ఆడడం.. అప్పుల బారిన పడటంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, సతీష్ మృతిపై ఎవరిపై అనుమానం లేదని సోదరుడు వెంకట్‌గౌడ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రియుడికి నిశ్చితార్థమైందని...

యువతి బలవన్మరణం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ప్రియుడికి మరొక అమ్మాయితో నిశ్చితార్థం కావడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా బెల్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బెల్ కాలనీలో నివాసముండే సుంకర రాజేశ్వరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. రెండో కుమార్తె కవిత (36) వివాహం చేసుకోలేదు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రుల వద్దనే ఉంటుంది. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో కవిత ప్రేమలో పడింది. వీరి ప్రేమ విషయం కవిత తల్లిదండ్రులకు మూడు నెలల క్రితం తెలిసింది. కాగా, కవిత ప్రియుడికి మరొక అమ్మాయితో ఇటీవల నిశ్చితార్థం జరిగింది. విషయం తెలిసినప్పటి నుంచి ఆమె ముభావంగా ఉండేది. గురువారం ఉదయం కవిత స్నానం చేసేందుకు బాత్రూంలోకి వెళ్లింది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తట్టినా స్పందించలేదు. చుట్టుపక్కల వారి సహకారంతో తలుపులు పగలగొట్టారు. అప్పటికే బాత్రూంలో కవిత చున్నీతో షవర్‌కు ఉన్న ఇనుప రాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే ఆమెను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే కవిత మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



కవిత మృతదేహం

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



సయ్యద్ మొయిన్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం బైక్ అదుపుతప్పిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా మర్పల్లికి చెందిన సయ్యద్ మొయిన్ (52) వ్యాపారం చేస్తుంటాడు. కర్నాటకలో ఉన్న భార్య వద్దకు బుధవారం బైక్‌పై బయలుదేరాడు. గురువారం తిరిగి జహీరాబాద్ వైపు వస్తుండగా 65వ జాతీయ రహదారిపై చిరాగ్‌పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు ముందు బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మొయిన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ వివరించారు.

భర్తతో వేగలేక.. కుటుంబ భారం మోయలేక..

వివాహిత ఆత్మహత్య



నవీన

మెదక్ మున్సిపాలిటీ: భర్త తాగుడుకు బానిస కావడంతో కుటుంబ భారం మోయలేక జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన గురువారం మెదక్ పట్టణంలోని జంబికుంట వీధిలో చోటు చేసుకుంది. మెదక్ మండలం పాతూర్ గ్రామానికి చెందిన దౌత శంకరయ్యకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు నవీన(23)ను మెదక్ పట్టణంలోని జంబికుంట వీధికి చెందిన ఇప్ప ప్రవీణ్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం పెళ్లి చేశారు. కొన్ని రోజులు వీరి సంసారం బాగానే సాగింది. ఈ క్రమంలో ప్రవీణ్ తాగుడుకు బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. భర్త తాగుడుకు బానిస కావడంతో కుటుంబ పోషణభారం పడింది. మరో వైపు ప్రవీణ్ గొడవలు పడుతుండటంతో జీవితంపై విరక్తి చెందిన నవీన బుధవారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు.